నవతెలంగాణ
ఆదిలాబాద్
1
శుక్రవారం | మార్చి 01, 2024 | www.navatelangana.com

హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన నాయకులు, అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మార్చి 4న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదిలాబాద్ రానున్న సందర్భంగా ఏర్పాట్లను అధికారులు, నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్టేడియంలో ఏర్పాటు చేయబోయే హెలీప్యాడ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ రాహూల్ రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు ఆర్‌అండ్‌బి, మున్సిపల్ కమిషనర్‌కు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.



ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పరీక్షకు ఆలస్యమై రాయలేకపోయి ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి శివకుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్ డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థి మృతదేహాన్ని రిమ్స్‌లో పరామర్శించి మాట్లాడారు. ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, ఈ నిబంధన ఎత్తి వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సంఘం జిల్లా నాయకులు ఆత్రం కిష్టన్న, మాంగుర్ల ఉప సర్పంచ్ లక్ష్మణ్ ఉన్నారు.



ఎట్టకేలకు డీఎస్సీ..!

- ఆరేండ్ల తర్వాత నోటిఫికేషన్ జారీచేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 1295 పోస్టుల భర్తీకి నిర్ణయం
- కొత్త జిల్లాల వారీగానే నియామకాలు
- ఫలించనున్న వేలాది మంది అభ్యర్థుల నిరీక్షణ

కొలువు కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్న అభ్యర్థుల నిరీక్షణ ఫలించనుంది. ఖాళీలతో సతమతమవుతున్న సర్కారు బడుల్లో నూతన ఉపాధ్యాయులు అందుబాటులోకి రానున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొద్దిరోజుల్లోనే నిరుద్యోగుల ఆశలను నిలబెడుతూ డీఎస్సీ(జిల్లా సెలక్షన్ కమిటీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో సర్కారు కొలువు కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఆరేండ్ల క్రితం గత ప్రభుత్వం నిర్వహించిన టీఆర్‌టీ స్థానంలో కొత్త సర్కారు గతంలో మాదిరిగానే డీఎస్సీ ద్వారానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాల వారీగా భర్తీ చేయనున్న పోస్టుల వివరాలను వెల్లడించింది. తాజాగా ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహణకు రంగం సిద్ధం చేయడంతో వేలాది మంది అభ్యర్థుల్లో సర్కారు కొలువులపై ఆశలు చిగురిస్తున్నాయి. తాజా నియామకాలను ప్రభుత్వం కొత్త జిల్లాల వారీగానే చేపట్టనుంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో హామీనిచ్చినట్లుగానే ఉద్యోగ నోటిఫికేషన్ల జారీ ప్రక్రియను ప్రారంభించినట్లు కనిపిస్తోంది. ఇది వరకే కొన్ని విభాగాలకు సంబంధించి ఉద్యోగాల నియామకపు ఉత్తర్వులు అందజేసిన ప్రభుత్వం తాజాగా రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో 11,062 పోస్టులను భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేయగా.. వీటిని ఆయా జిల్లాల వారీగానే భర్తీ చేయాలని నిర్ణయించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో టీఎస్‌పీఎస్సీ ద్వారా టీఆర్‌టీ పేరిట ఉపాధ్యాయ నియామకాలు చేపట్టింది. అప్పట్లో ఉమ్మడి జిల్లా యూనిట్‌గా 1582పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా.. 1229 పోస్టులను భర్తీ చేసింది. మిగిలిన 353 పోస్టుల్లో అభ్యర్థుల కొరత కారణంగా భర్తీ చేయలేకపోయింది. తాజాగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 1295 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 324 పోస్టులు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 341 పోస్టులు, నిర్మల్‌లో 342 పోస్టులు, మంచిర్యాలలో 288 పోస్టులు భర్తీ కానున్నాయి. కాగా ఈ పోస్టులకు ఈ నెల 3వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

పోస్టులకు పోటీ తీవ్రం..!

గత ప్రభుత్వం 2017లో టీఆర్‌టీ నోటిఫికేషన్ వేయగా.. వేలాది మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఇందులో పోస్టులు దక్కిన వారు విధుల్లో చేరిపోగా.. మిగితా వారు మరో డీఎస్సీ కోసం వేచిచూస్తున్నారు. తాజాగా దాదాపు ఆరేండ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో వేలాది మంది అభ్యర్థులు ఈ నియామక పరీక్ష కోసం ఎదురుచూస్తున్నారు. ఈ లెక్కన గతంలో పోస్టులు దక్కని వారితో పాటు ఈ ఆరేండ్ల కాలంలో డీఎడ్, బీఎడ్ కోర్సులు పూర్తిచేసి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న వారు అనేక మంది ఉన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 1295 పోస్టులు భర్తీ కానుండగా ఈ పోస్టులకు సుమారు 25వేల మంది అభ్యర్థులకు పైగానే పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పుస్తకాలతో కుస్తీ పడుతున్న నిరుద్యోగులు ఈ పరీక్ష కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

జిల్లాల వారీగా భర్తీ అయ్యే పోస్టుల వివరాలు

పోస్టులు	ఆదిలాబాద్	ఆసిఫాబాద్	నిర్మల్	మంచిర్యాల
స్కూల్ అసిస్టెంట్లు	74	62	70	70
లాంగ్వేజీ పండిట్	14	25	04	16
పీఈటీ	02	02	04	03
ఎస్‌జీటీలు	209	234	236	176
ఎస్‌ఏ(స్పె.ఎడ్యుకేటర్)	06	03	05	05
ఎస్‌జీటీ(.. ..)	19	15	23	18
మొత్తం	324	341	342	288

కార్మికులకు హక్కులు తెలియజేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికులకు వారి హక్కులు, చట్టాల గురించి కార్మిక శాఖ తరపున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజేంగుల రాజు అన్నారు. జాతీయ సంఘం పిలుపు మేరకు గురువారం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం అసిస్టెంట్ లెబర్ ఆఫీసర్ రాజలింగుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన అవగాహన లేక సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నారన్నారు. మండలాల వారీగా కార్మిక శాఖ తరపున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అదే విధంగా కార్మికుల పిల్లల చదువుకు రూ.3వేల స్కాలర్‌షిప్, 60 సంవత్సరాలు నిండిన వారికి రూ.6వేలను పింఛన్, అడ్డాల వద్ద మౌళిక వసతులతో షెల్టర్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగయ్య, సహాయ కార్యదర్శి ఆకుల రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు టాక్రే మహేందర్, సహాయ కార్యదర్శి నాగోరావ్, రమేష్, ఎస్.కుమార్ పాల్గొన్నారు.

ఒత్తిడికి లోనుకాకుండా చదువుకోవాలి



నవతెలంగాణ-జైనథ్

ప్రతి విద్యార్థి ఒత్తిడికి లోను కాకుండా శ్రద్ధతో చదువుకోవాలని ఏఎస్సీడీఓ(అసిస్టెంట్ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో వార్డెన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో శ్రద్ధగా చదవాలన్నారు. ఒత్తిడికి లోను కావద్దని, అఘాయిత్యాలకు పాల్పడవద్దని తెలియజేశారు. ప్రతి ఒక్కరు మంచి మార్కులు సంపాదించి ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి నయనత, వార్డెన్ నారాయణ, కనకయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ ఎజెండా అంశాలను ఉర్దూలోనూ ప్రచురించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ ఎజెండా అంశాలను ఉర్దూలో సైతం ప్రచురించాలని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ అన్నారు. ఈ విషయమై యూనియన్ సభ్యులతో కలిసి గురువారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖమర్ హైమద్‌ను కలిసి విన్నవించారు. అనంతరం నూతన బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు మహబూబ్, అన్వర్, ఖిజార్ యాఫై, అమీమ్ షరీఫ్, షేక్ మోయిజ్, షేక్ అస్మత్ అలీ ఉన్నారు

పాఠశాలలో మద్యం తాగిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ - కాసిపేట

బెల్లంపల్లి మండలం చర్లపల్లి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో మద్యం తాగిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, బెల్లంపల్లి మండల నాయకులు అంజన్న, స్వామి, సంతోష్, భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి సక్రమ దారిలో నడిపించాల్సిన ఉపాధ్యాయులే పాఠశాల సమయంలో మద్యం తాగడం దారుణమన్నారు. ఎంఈవో పర్యవేక్షణ లేనందునే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలను కాపాడే పనిలోనే బిజీగా ఉన్నందువల్ల ప్రభుత్వ పాఠశాలను కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. వెంటనే ఆ ఉపాధ్యాయుడిని, ఎంఈఓను విధుల నుండి తొలగించాలని, లేని పక్షంలో మార్చి 1న డీఈవో ఆఫీస్ ముట్టడి చేపడతామని హెచ్చరించారు.

ఆదిలాబాద్ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

- మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి
- ఎమ్మెల్యే పాయల్ శంకర్




మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, పక్కన మున్సిపల్ చైర్మెన్ ప్రేమేందర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజకీయలకు అతీతంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీని తెలంగాణలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్మెన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలిసారిగా ఎమ్మెల్యే సమావేశానికి హాజరు కావడంతో కమిషనర్ ఖమర్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ జోగుప్రేమేందర్, జహీర్ రంజాన్, కౌన్సిలర్లు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

రాజకీయాలకు అతీతంగా పని చేయాలి

రాజకీయాలకు అతీతంగా పని చేసి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. మున్సిపాలిటీని రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలన్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు కేవలం తమ వార్డు అభివృద్ధి గురించి కాకుండా అన్ని వార్డుల గురించి పట్టించుకొని సమిష్టిగా పని చేయాలన్నారు. స్థానిక సంస్థలకు పరిమితమైన నిధులు ఉంటాయని, ఆర్థిక పరమైన అంశాలలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆదిలాబాద్ మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. గతంలో మంజూరైన నిధులు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయన్నారు. దీని కారణాలను తెలుసుకుంటూ త్వరతగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. కార్మికులకు నెలనెల సక్రమంగా వేతనాలు చెల్లించాలన్నారు. ప్రజలతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు కర్తవ్యంగా భావించాలన్నారు. వ్యవస్థ చాలా గొప్పదని ప్రభుత్వాలు మారినా, ఎమ్మెల్యేలు మారినా వ్యవస్థను క్రమశిక్షణగా నడపాలన్నారు. తన రాజకీయ జీవితంలో అనేక స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించనన్నారు. అందరి భాగస్వామ్యం ఉంటేనే ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో జరిగే ప్రతి అంశంపై చర్చ జరగాలని, ప్రతి కౌన్సిలర్‌కు ప్రతి విషయంపై అవగాహన ఉండాలన్నారు. సమస్యపై కచ్చితంగా చర్చ జరగాలని, చర్చ జరిగితే ఆ అంశంపై అవగాహన వస్తుందన్నారు. ఎన్నికల వరకే పార్టీలుంటాయని, గెలిచిన తరువాత ప్రతి ఒక్కరు ప్రజల కోసమే పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కౌన్సిల్ సభ్యులు

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. జిసి. సుబ్బారాయుడు

నవతెలంగాణ-నస్పూర్

మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. జిసి. సుబ్బారాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసి జిల్లాను పోలియో రహిత జిల్లాగా మార్చాలని తెలిపారు. జిల్లాలో 0-5 సంవత్సరాల వయసు గల పిల్లలకు వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందని, దీనికి కేంద్రాల ఏర్పాటుతో పాటు కార్యక్రమ నిర్వహణ కొరకు సూపర్వైజర్లు, మొబైల్ బృందాలను నియమించామని తెలిపారు. జిల్లాలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, వివిధ కూడళ్లలో వ్యాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

3న వ్యాక్సినేషన్ కాని పిల్లలకు 4, 5 తేదీలలో ప్రతి ఇంటికెళ్లి పిల్లలకు వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. 3న ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు పల్సిపోలియో కేంద్రాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సోయా, శనగ కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి



నవతెలంగాణ-జైనథ్

సోయా, శనగ కొలుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకులు లింగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపైన గురువారం బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన చేయడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ గతంలో తమ ప్రభుత్వం ప్రతి రైతు వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని తెలిపారు. మార్కెట్‌ను ప్రారంభించిన రెండో రోజే కొనుగోలు నిలిపేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాలు మారినా పథకాలు మారవు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలకు మంచిచేసే, అవసరాలను తీర్చే ఏ పథకాన్ని అయినా ప్రభుత్వాలు కొనసాగించాల్సిందేనని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. దీనికి తెలుగుదేశం పార్టీ హయాంలో ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రారంభించిన రూపాయి కిలో బియ్యం పథకమే ఉదాహరణ అని తెలిపారు. అంతేగాని ప్రభుత్వాలు మారినంత మాత్రాన పథకాలను ఎవరు రద్దు చేయలేదని అన్నారు. గురువారం పట్టణంలోని జెడ్పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాలు, పట్టణంలోని లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే, జెడ్పి చైర్మన్ జనార్దన్ రాథోడ్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి చెక్కులను వెనువెంటనే అందించాలని, మంజూరైన వారం రోజులకే చెక్కులను పంపిణీ చేయాలని తెలిపారు. నాయకుల కోసం వేచి చూడకుండా లబ్ధిదారులకు చెక్కులను అందించాలని అధికారులను ఆదేశించారు. కూతురు పెళ్లి జరిగి మరో ఇంటికి పోయిందన్న బాధలో ఉన్న వాళ్లకి అప్పుల బాధ ఉంటుందని, అలాంటి వారికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ కొంత ఊరటనిస్తుందన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని కొమ్ముగూడ, బూరుగూడ, చోర్పల్లి గ్రామాలలో ఎన్టీఆర్ఎఫ్ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్లకు గురువారం టిపిసిసి కార్యవర్గ సభ్యులు డాక్టర్ రాథోడ్ గణేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలలో ఇప్పటికే నాలుగు పథకాలను ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలోనే మిగతా రెండు పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్ల నారాయణ, గడ్డల సత్తయ్య, ఎండి నిజాం, ఇస్మాయిల్, తిరుపతి, ఇంగు పోశన్న, బాధిరావు పాల్గొన్నారు.

నంనూర్‌లో సివిల్ రైట్స్ డే



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని నంనూర్ గ్రామంలో తహసీల్దార్ సతీష్ కుమార్, ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో గురువారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనాన్ని ఎవరూ పాటించొద్దని తెలిపారు. రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజల పౌర హక్కులను వివరించారు. గ్రామంలో మద్యపానం నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి శాంతిరేఖ, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, డీటీ హరిత, ఆర్ఐ మంగ, గ్రామ కార్యదర్శి పావని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, అంజయ్య, రేగుంట లింగయ్య పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని స్థానిక పీహెచ్‌సీలో పల్స్ పోలియోపై డా.శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేసి, అవగాహన కల్పించారు. మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలన్నారు. మండలంలోని 0-5 సంవత్సరాల్లోపు 3,841 మంది పిల్లలు ఉన్నారన్నారు. వీరికి రెండు రూట్లలో పోలియో సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో పోలియో చుక్కలు వేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీహెచ్ఓ సందీప్, హెచ్ఎస్‌లు శ్రీనివాస్, లక్ష్మీ కాంతామణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులను కల్పించాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. గురువారం మండలంలోని ఘన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శంభుగూడ గ్రామంలో ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనిని కల్పించాలని, జాబ్ కార్డు లేని వారికి జాబ్ కార్డు ఇప్పించి, ఉపాధి కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఫీల్డ్ అసిస్టెంట్ మారు, కూలీలు ఉన్నారు.



కొత్త చైర్మెన్ పనితీరుపై కోటి ఆశలు..!

- సమస్యల పరిష్కారం కోసం ప్రజల ఎదురు చూపులు
- ఖానాపూర్ మున్సిపల్ కొత్త పుంతలు తొక్కేనా?



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రాజకీయంగా ప్రత్యర్థి నాయకులపై పైచేయి సాధించడం హర్షనీయమే అయినా, అంతిమంగా అందరి మెప్పు పొందిన నాయకున్నే ప్రజలు అభినందిస్తారు. సదరు నాయకుని సేవలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటారు. గతంలో ఖానాపూర్‌లో ఎంపీపీగా పనిచేసిన కే.జగన్నాథరావు చేసిన సేవలను రైతులు, విద్యార్థులు, ప్రజలు ఇప్పటికీ గుర్తు చేస్తుంటారు. అలాగే సర్పంచ్‌గా పనిచేసిన విలాస్‌రావ్ దేశ్ పాండే ప్రజలతో మమేకమైన తీరును సైతం గుర్తు చేస్తారు. వారి పని తీరుకు గుర్తుగా పట్టణ నడిబొడ్డున తెలంగాణ చౌక్‌లో జగన్నాథ్‌రావు విగ్రహం, పాత ఖానాపూర్ ప్రాంతంలోని శ్రీరాంనగర్‌లో విలాస్‌రావ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ముప్పై ఏండ్ల క్రితం నాటి వారి పాలన తీరును ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకోవడం గమనార్హం. ప్రజల కోసమే పనిచేస్తానని చెబుతున్న కొత్తగా మున్సిపల్ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన చిన్నం సత్యం పనితీరుపై ఇప్పుడు పట్టణంలో చర్చ జరుగుతోంది. ప్రజలు, అభివృద్ధే తన ఎజెండాగా చెబుతున్న చిన్నం సత్యం మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజూరా గ్రామం నుంచి ఇరవై ఏండ్ల క్రితం ఇక్కడికి వచ్చారు. సమకాలీన రాజకీయాల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. కొత్తగా ఏర్పడిన ఖానాపూర్ మున్సిపాలిటీలో మొదటి పర్యాయం జరిగిన ఎన్నికల్లో ఆయన కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలిచారు. అలాగే ప్రజలకు ఆయన పట్ల ఉన్న విశ్వాసంతో చైర్మెన్ పీఠం కూడా అధిరోహించారు. అంతవరకు బాగానే ఉన్నా చైర్మెన్‌గా ఆయన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తేనే ప్రజలు హర్షిస్తారు. లేనట్లైతే గతంలో పదవుల కోసమే పనిచేశారన్న విమర్శలు ఎదుర్కొన్న నాయకుల జాబితాలో చేరిపోతారు.

సమస్యలు పరిష్కారం అయ్యేనా..!

పట్టణంలో గత పదేండ్లుగా ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయి. తాగునీరు, డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు, డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో జరిగిన అవకతవకలు, శిథిలమైన ప్రభుత్వ భవనాలు, ఇలా అనేక సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా రోడ్డు వెడల్పు సమస్య రాజకీయ వ్యవహారంగా మారింది. రోడ్డు వెడల్పు విషయంలో అప్పటి మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రజల అభిప్రాయానికి భిన్నంగా వ్యవహరించారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. స్వలాభాపేక్షతో రోడ్డు వెడల్పును నిబంధనల ప్రకారం కాకుండా, అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు నచ్చినట్లుగా వ్యవహరించారన్న ఆరోపనలు ఉన్నాయి. పోలీసు స్టేషన్ వరకు ఉన్న ఆర్ అండ్ బీ రహదారిని అక్కడి వరకు కాకుండా స్థానిక కొందరు నాయకుల వ్యాపార సముదాయాలకోసం తెలంగాణ చౌక్ వరకే పరిమితం చేశారన్న విమర్శలున్నాయి. రహదారికి ఇరుపక్కల చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణాలు, సెట్ బ్యాక్, డివైడర్ల ఏర్పాటులోనూ నిబంధనలు ఖాతరు చేయలేరన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. వీటి నిర్మాణం విషయంలో అప్పట్లో మెజారిటీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. ఇలా గతంలో ఎమ్మెల్యే రేఖానాయక్ అనుసరించిన తీరు, అప్పటి చైర్మెన్ అనుసరించిన తీరును వ్యతిరేకించిన మెజారిటీ సభ్యులు అంకం రాజేందర్‌పై అవిశ్వాసం పెట్టి, ఇప్పుడు కొత్త చైర్మెన్‌గా చిన్నం సత్యాన్ని ఎన్నుకున్నారు. గతంలో పదే పదే అవినీతిపై మాట్లాడిన కొత్త చైర్మెన్ చిన్నం సత్యం, వైస్ చైర్మెన్ కావలి సంతోష్ ఇప్పుడు మున్సిపల్‌లో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తారా.. లేక అనుయాయులు, వ్యక్తిగత అవసరాల పైనే దృష్టి సారిస్తారో... వేచి చూడాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కోట్నాక విజయ్ కుమార్



నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ని బీజేపీ ఎస్టీ మోర్చ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకుడు కోట్నాక విజయ్ కుమార్ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ ఉద్యమంలో తోటి నాయకుడిగా ఉద్యమాలు చేసినా విషయాలను పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు. అనంతరం అభివృద్ధి చేసే విషయంలో ఎమ్మెల్యేగా ముందు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటునట్టు, ప్రజలు అందించిన ఈ అవకాశాన్ని సమర్థవతంగా రాజకీయ నాయకుడిగా ముద్ర వేసి మరింత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బీజేపీ నాయకులు యలమంచి సునీల్ చౌదరి, మద్రాజు రాంబాబు, పాల్గొన్నారు.

శుద్ధ జల సౌకర్యం కల్పించిన జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్



నవతెలంగాణ-ఉట్నూర్

పల్లె నిద్ర సమయంలో మండలంలోని కన్నాపూర్ గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్ గురువారం నెరవేర్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి ఉన్నత అధికారులతో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టామని, అక్కడ ఉన్నటువంటి గ్రామ సమస్యలను పూర్తి స్థాయిలో పరిశీలించామని అన్నారు. ఆ సమయంలోని గ్రామ ప్రజలు వినవించిన సమస్యలను పరిష్కరిస్తానని హామినిచ్చానని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎస్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.5లక్షల నిధులతో గురువారం మండలంలోని పొచ్చెర గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ పోతారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇచ్చిందన్నారు. అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్.కిష్టారెడ్డి, పురుషోత్తం, ఎస్.హరీష్‌రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఏ.గంగాధర్, నరేష్, మల్లేష్ పాల్గొన్నారు.

జీఓ నెం.3పై మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

గిరిజన ప్రాంత ఉద్యోగాల్లో, గిరిజన యువతకు వంద శాతం రిజర్వేషన్ కల్పించే జీవో నెం.3పై రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేయాలని, దానిపై ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్న ప్రధాన మంత్రి మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో టీఏజీఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కరోనా కాలంలో దొంగ దారిన జీవో నెం.3ను రద్దు చేసి ఏజెన్సీ గిరిజన యువతకు అన్యాయం చేసిందని ఆరోపించారు. 4న ఆదిలాబాద్‌కు వస్తున్నా ప్రధాన మంత్రి మోడీ గిరిజన యువతకు దోహద పడే జీవో నెం.3పై స్పష్టమైన ప్రకటన చేయాలని, ఆదివాసులు అధికంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాకు గిరిజన సెంట్రల్ యూనివర్సిటీ, ఉట్నూర్ కేంద్రంగా సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి ప్రకటన చేయాలనీ డిమాండ్ చేశారు. ఆదివాసులను అడవి నుంచి దూరం చేసేలా, కేంద్రం తీసుకొచ్చిన నూతన అటవీ చట్టాన్ని రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా ఎన్నో సంవత్సరాల నుంచి గిరిజనులు పోరాడి సాధించుకున్న పీసా, 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, గ్రామ సభల చట్టాలను ఇది నిర్వీర్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం గిరిజన బడ్జెట్‌ను డైవర్ట్ చేస్తూ, కార్పొరేట్ పథకాలకు మళ్లించడం చేస్తుందన్నారు. బీజేపీ కేవలం ఆదివాసులను ఓటు బ్యాంకుగా చూస్తూ, ఆదివాసుల సమస్యలను గాలికి వదిలేస్తుందని విమర్శించారు. గొప్పగా ప్రకటించిన పీఎం జన్‌మన్ కార్యక్రమం అటక్కెకిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తొడసం భీంరావ్, జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షులు లంక రాఘవులు, మడవి నాగోరావ్, ఆత్రం కిష్టన్న, సహాయ కార్యదర్శి కనక మల్కు, కోవ సునీల్, మెస్రం మహేష్, పెందోర్ నగేష్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి విద్యుద్ఘాతంతో యువకుడు మృతి

నవతెలంగాణ-తలమడుగు



చేపల వేటకు వెళ్లి విద్యుద్ఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సుంకిడి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ర్యాపని లస్మన్న(31) కూలి పనులు చేసుకునేవాడు. బుధవారం ఉండం, సుంకిడి గ్రామాల మధ్య గల నల్లగుండ్ల మడుగు వద్ద విద్యుత్ తీగలతో చేపల పట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు, విద్యుద్ఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండీయర్ పరీక్ష

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో గురువారం కొనసాగిన ఇంటర్ సెకండీయర్ మొదటి పరీక్షలో మొత్తం 278 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, అందులో 275 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటరమణ కళాశాల ఇన్‌ఛార్జి కాంబ్లే బాలాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


యువతకు అండగా కాంగ్రెస్

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ యువతకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంబడి రాకేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ యువతకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దన్నలాంటి గొప్ప వ్యక్తి అని అన్నారు. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించడంతో నిరుద్యోగుల ముఖాల్లో చిరునవ్వులు వెల్లివిరిశాయని తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తుందని తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని కోర్ట నూతనంగా నిర్మించిన శ్రీ ఓంకారేశ్వర ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కన్నుల పండవగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులను గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, బాయిన్‌వార్ గంగారెడ్డి, తమ్మల చందు, బూర్ల శంకరయ్య, కోరేటి కిషన్ పాల్గొన్నారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-కుభీర్

రానున్న పదో తరగతి పరీక్షలలో ప్రతి ఒక విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. కష్టపడి చదివి పరీక్షలలో ఉత్తమ ర్యాంకులు సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ప్రతి సబ్జెక్ట్‌లో ప్రతి విద్యార్థి సందేహాలను నివృత్తి చేసేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. అనంతరం అక్కడి నుంచి కాస్రా గ్రామపంచాయతీలోని నర్సరీని పరిశీలించి, ప్రతి మొక్కను సంరక్షించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. హరితహారంలో భాగంగా గ్రామాలకు అవసరమైన మొక్కలను నర్సరీలలో పెంచాలని అన్నారు. వేసవిలో మొక్కల సంరక్షణకు ప్రతిరోజూ నీరు అందించాలని, గ్రీన్ మ్యాట్ వంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రవీందర్ రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ చంద్రకాంత్, ఉపాధి హామీ ఏపీఓ హరిలాల్, ఆయా శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షల్లో భయాన్ని వీడాలి

నవతెలంగాణ-తలమడుగు



కెరీర్ గైడెన్స్ మోటివేషన్ స్పీకర్లను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

విద్యార్థులు పరీక్షల్లో భయాన్ని వీడాలని కెరీర్ గైడెన్స్ మోటివేషనల్ స్పీకర్ అల్లం సాయికృష్ణ, రమణగౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ఖోడద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై మార్గదర్శనం చేశారు. విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడి, ఉన్న సమయాన్ని ప్రణాళిక బద్ధంగా చదివినట్లయితే తప్పకుండా మంచి మార్కులు సాధించి, ఉత్తీర్ణులు కాగులుగుతారని తెలిపారు. భవిష్యత్తులో తాము ఏమి కావాలో నిర్దేశించుకుని దానికి సంబంధించిన కోర్సులను చదివితే తక్కువ సమయంలోనే తమ లక్ష్యాలను చేరుకోగలుగుతారని అన్నారు. పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులతో పాటు మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా విని, చదివి పరీక్షలు రాయాలని విద్యార్థులను కోరారు. జీవితంలో అసాధ్యమైనది ఏది ఉండదని లక్ష్యంతో చదివితే ఏదైనా సాధించవచ్చు అన్నారు. ఉదాహరణలతో పిట్టకథలతో విద్యార్థులను ఆకర్షించే విధంగా వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కృష్ణకుమారి, ఉపాధ్యాయులు లక్ష్మి, సుకుమార్ పెట్కులే, సురేఖ, ఎస్.సురేఖ, సత్యనారాయణ, వాసుదేవ్, పీఈటీ మమత, కిరణ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.


గురుకుల డిగ్రీ అధ్యాపక నియామక పరీక్షలో బేలవాసికి మొదటి ర్యాంకు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గురుకుల డిగ్రీ అధ్యాపక నియామక పరీక్షా ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రానికి చెందిన బొడుకుంటవార్ గణేష్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. పేదరికాన్ని, అంగవైకల్యాన్ని జయించి తానేంటో నిరూపించాడు. గణేష్ బేల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివాడు. ఇంటర్మీడియట్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాడు. డిగ్రీ నలందా కళాశాలలో పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ చదివాడు. ముందుగా సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా ఉద్యోగం సాధించాడు. అయితే ఏడాది కింద రోడ్డు ప్రమాదంలో తన కాలును కోల్పోయాడు. అయితే ఆ తర్వాత గురుకుల డిగ్రీ అధ్యాపక నియామక పరీక్షలకు హాజరయ్యాడు. ఫిబ్రవరి 28న విడుదల చేసిన ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-ఉట్నూర్

శ్రీహనుమాన్ నూతన ఆలయంలో శ్రీ ఆంజనేయుల విగ్రహన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన చేయడం జరిగిందని, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామంలో శ్రీ హనుమాన్ మందిరం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, బానోత్ జగన్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి ఆంజనేయస్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం మహారాజులు లింబాజీ మహారాజ్, రామ్ సింగ్ మహారాజ్, చందర్ సింగ్ మహారాజ్, సూరజ్ మహారాజ్, దేవ్ సింగ్ మహారాజ్, ప్రేమ్‌సింగ్ మహారాజ్‌లు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ విఠల్, బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంచందర్, దేవిదాస్, వివిధ గ్రామాల ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలో 41 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో రెండు పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలో మొత్తం 41 మంది గైర్హాజరైనట్టు పరీక్షల చీఫ్ సుపరింటెండెంట్ ధన్‌రాజ్ తెలిపారు. ప్రభుత్వ కళాశాల కేంద్రంలో 37 మంది, ప్రయివేట్ క్రిసెంట్ కళాశాల కేంద్రంలో నలుగురు గైర్హాజరయ్యారని తెలిపారు.

3

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

శుక్రవారం | మార్చి 01, 2024 | www.navatelangana.com

గోలేటి వారసంతలో అన్నదానం

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని గోలేటి గ్రామంలో ప్రతి గురువారం నిర్వహించే వారసంతలో సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వారం కడతల తిరుపతి సహకారంతో వారసంతలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కడతల తిరుపతి మాట్లాడుతూ గోలేటి వారసంతకు దూరప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు, వ్యాపారస్తులకు సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి వారం అన్నదాన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. దాతలు వీరికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వసీం, మోయిన్, తిరుపతి పాల్గొన్నారు.

మార్చి 3 నుండి పల్స్ పోలియో కార్యక్రమం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మార్చి 3 నుంచి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు లోనవెల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు డాక్టర్ నవత అన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో మార్చి మూడు నుండి ఐదో తేదీ వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు, మండలంలోని 0 నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తల్లిదండ్రులు వేయించాలని సూచించారు. మండలంలో 8775 ఇండ్లు ఉన్నాయని, మొత్తం 0 నుండి ఐదు సంవత్సరాల వయసు గల పిల్లలు 3170 మంది ఉన్నారని, వీరి కొరకు మండల వ్యాప్తంగా 25 బూత్ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులకు తమ పిల్లలకు పోలియో సోకకుండా చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. మరిన్ని వివరాల కోసం గ్రామాల్లో ఉన్న సబ్‌సెంటర్‌లను సంప్రదించాలన్నారు. వైద్య సిబ్బంది కూడా ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేస్తారన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

- కాగజ్‌నగర్ ఏఓ రామక్రిష్ణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఎరువుల, విత్తన దుకాణం డీలర్లు రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ మండల వ్యవసాయాధికారి రామక్రిష్ణ హెచ్చరించారు. మండలంలోని ఏఓ కార్యాలయంలో గురువారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎరువుల దుకాణం డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాని సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అవసరమున్న మందులు మాత్రమే ఇవ్వాలని అదనంగా మందులు అంటకట్టరాదన్నారు. దుకాణాలలో స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఎవరైనా గ్లైసిల్ విత్తనాలు అమ్మితే లైసెన్సు రద్దు చేస్తామని, అలాంటి వారి వివరాలను పోలీసులకు, వ్యవసాయాధికారులకు అందించాలన్నారు. డీలర్ల లైసెన్సులను ఓఎల్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధికి చర్యలు

- జిల్లా విద్యాధికారి పార్శి అశోక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరింత వేగంగా అభివృద్ధి చెందాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. స్థానిక జెడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిసిబిలిటీ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో అందించే "మానసిక విద్యార్థులకు బోధన అభ్యసన సామాగ్రిని" పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన అభ్యసన సామాగ్రిని ఏ విధంగా వినియోగించుకోవాలని విలీన విద్య రిసోర్స్ పర్సన్స్ శిక్షణ ఇస్తారని, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వాటిని వినియోగించుకొని అందరితో సమానంగా ఆకాశమే హద్దుగా ఎదగాలన్నారు. సంస్థ అందిస్తున్న కిట్లు వినియోగించుకోవాలని వాటి విలువ ఒక్కోటి రూ.10 వేలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐపీ ఐడీ ప్రతినిధి శ్యామ్, విలీన విద్య కోఆర్డినేటర్ కటకం మధుకర్, కోఆర్డినేటర్ అబిద్ అలీ, పాఠశాల ఇన్‌చార్జి ప్రధాన ఉపాధ్యాయులు ఖాలిఖ్, ఉపాధ్యాయులున్నారు.

ఆలయ ఉత్సవ కమిటీ చైర్మెన్‌గా మురళీధర్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయ మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ చైర్మెన్‌గా పట్టణానికి చెందిన వ్యాపారి మైలారపు మురళీధర్ నియమితులయ్యారు. ఆలయంలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే జాతర ఉత్సవ కమిటీని దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ ఆదేశాల మేరకు సిర్పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ మేరకు చైర్మెన్‌గా మైలారపు మురళీధర్, సభ్యులుగా ఎమ్మాజీ శారద, హరి ప్రసాద్ సోని, శృంగారపు ప్రసాద్, జెరుపుల తిరుపతి, రాటెంకి సత్తయ్యలను నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ వి. అనీల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నియమితులైన చైర్మెన్, సభ్యులు గురువారం ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి గెర్రె వేణుగోపాల్ గుప్తా ఆధ్వర్యంలో సత్కరించారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మెన్ మైలారపు మురళీధర్ మాట్లాడుతూ అందరి సమన్వయంతో జాతర ఉత్సవాలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

ప్రయాణికులు సహకరించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాగజ్‌నగర్, సిర్పూర్ మార్గమధ్యలో ఉన్న వేంపల్లి రైల్వేగేట్ దగ్గర ఫ్లై ఓవర్ పనులు కొనసాగుతున్నాయని, గురువారం రాత్రి ఎనిమిది గంటల నుండి రెండో తేదీ ఉదయం ఎనిమిది గంటల వరకు రైల్వేగేటు మూసివేస్తున్నట్టు ఎస్ఐ దీకొండ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు సహకరించి కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రయాణికులు పెద్దబండ, చింతకుంట, చుంచుపెల్లి, ఈజ్‌గాం మీదుగా కాగజ్‌నగర్‌కు వెళ్లాలని, కాగా తిరిగి అదే మార్గంలో సిర్పూర్‌కు రావాలని సూచించారు. దీనిని ప్రతి ఒక్కరు గమనించి రైల్వే శాఖ అధికారులకు సహకరించాలన్నారు.

అడ్డగోలుగా ఔషధ వ్యాపారం

మెడికల్ షాపు చిన్నదైనా..పెద్దదైనా అందులో ఫార్మాసిస్ట్ ఉండాలి. మందులు ఎలా వేసుకోవాలో రోగికి విడమర్చి చెప్పాలి. డాక్టర్ ప్రిసిప్షన్ ఉంటేనే మందులు ఇవ్వాలి. రోగి శారీరక, మానసిక పరిస్థితిని బట్టే అవసరమైన మందులు ఇవ్వాలి. ఇలా మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధలను పాటించాలి. కానీ జిల్లాలో మందుల దుకాణాల వ్యాపారం కిరాణ షాపుల్లా మారింది. డాక్టర్ రాసిచ్చే చిట్టీతో సంబంధం లేకుండా ఎవరడిగినా మందులు ఇచ్చేస్తున్నారు. డి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటే చాలు. మెడికల్ షాపు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే దుకాణదారులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నవతెలంగాణ-కెరమెరి

- నామమాత్రంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు
- షాపుల్లో బినామీల దందా.. కానరాని ఫార్మాసిస్టు
- రోగుల ప్రాణాలతో చెలగాటం

మీకు తల నొస్తోందా..? జ్వరం వస్తోందా? కడుపు నొప్పి.. ఒళ్లు నొప్పులతో భరించలేకుండా ఉన్నారా..? నిద్ర పట్టడం లేదా..? ఏం భయం లేదు. అనారోగ్య సమస్యలపై డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే లేదు. తలెత్తిన అనారోగ్యం గురించి చెబితే చాలు.. మెడికల్ షాపుల్లో అన్ని రకాల మందులూ ఇస్తారు. ఎంత మొత్తంలో కావాలన్నా ఇస్తారు. డాక్టర్ ప్రిసిప్షన్ అవసరమే లేదు. ఏ మందులు వేసుకోవాలో రోజుకు ఎన్ని వేసుకోవాలో ఎన్ని రోజులు వాడాలో కూడా మెడికల్ షాపుల నిర్వాహకులే చెప్పేస్తారు. ఈ విధంగా జిల్లాలో మెడికల్ షాపుల నిర్వాహకులు అడ్డగోలు వ్యాపారం నిర్వహిస్తున్నారు. పలు అలోపతి మెడిసిన్ విచ్చలవిడి అమ్మకాలపై ఔషధ నియంత్ర అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు తనిఖీలు చేయడం, నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. నిబంధనల ప్రకారం వైద్యుల ప్రిసిప్షన్ ఉంటేనే మెడికల్ షాపుల్లో మందులు ఇవ్వాలి. ఈ నిబంధనలను చాలా మంది దుకాణదారులు పాటించడం లేదు. జ్వరం, జలుబు, తలనొప్పి, కడుపునొప్పి గ్యాస్ట్రిక్ సమస్యలు, ఒంటినొప్పులు తదితర సమస్యలకు మెడికల్ షాపుల్లో అడగ్గానే మందలిస్తున్నారు.

డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు

కార్డియాలజీ, సైక్రియాట్రిక్, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, డయాబెటిక్, బీపీ, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ తదితర సమస్యలకు డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదు. ఈ వ్యాధుల ఔషధాల్లో హై డోస్.. లో డోస్ అనే రకాలు ఉంటాయి. వ్యాధి తీవ్రత, రోగి వయసు, శరీర తత్వం తదితరాలను బట్టి డాక్టర్లు మెడిసిన్‌ను నిర్ణయిస్తారు. సాధారణంగా మెడికల్ షాపుకు వెళ్లి అడిగితే ఏ రోగానికైనా, ఎన్ని మందులు కావాలన్నా ఇచ్చేస్తున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డవారు కొందరు దగ్గుకు వాడే సిరప్‌లు తాగుతున్నారు. కోరెక్స్, పెన్సిడ్రిల్ వంటి ఔషధాలు కొంత మత్తును కలిగిస్తాయి. ఆల్కహాల్, ఇతర మత్తు పదార్థాలకు బానిసైనవారు అవి దొరకని సమయాల్లో మెడికల్ సిరప్‌లు వాడుతున్నారు. ఈ తరహా సిరప్‌లు డాక్టర్ రాసిస్తేనే రోగికి ఇవ్వాలి. కానీ కొన్ని మెడికల్ షాపుల్లో ఎవరెన్ని, ఏమి అడిగినా ఇచ్చేస్తున్నారు.

లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది

ఉమ్మడి జిల్లాలో మందుల షాపులు బినామీ వ్యక్తులే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితో మాత్రమే దుకాణాలను నిర్వహించాలి. చాలా మంది తక్కువ వేతనంతో యువకులకు పనిలో పెట్టుకుంటున్నారు. మెడికల్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఏడీలు మెడికల్ షాపుల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకొని నిబంధనలకు పాతరేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులు షాపులను తనిఖీ చేసి బినామీలను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.



అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



ఘటన స్థలంలో విచారణ చేపడుతున్న డీఎస్పీ, సీఐ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలో వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. రాత్రి నుండి కనిపించకుండా పోయిన మహిళ తెల్లవారుజామున ఇంటి సమీపంలోని పొదల్లో శవంగా కనిపించింది. కుటుంబ సభ్యులు వివాహిత మృతిపై అనుమానాలు వ్యక్తం చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని ఈజ్‌గాం పోలీస్ స్టేషన్ పరిధి గన్నారం గ్రామం మండువకు చెందిన కమ్మరి గణపతి- కమల దంపతుల కూతురు కమ్మరి రోజా(25)కు అయిదేండ్ల కింద వివాహం జరిగింది. ఈ క్రమంలో ఓ పాప పుట్టి చనిపోయింది. మూడేళ్ల కింద కుటుంబ కలహాలతో రోజాకు విడాకులు అయ్యాయి. భర్తతో విడాకులు తీసుకున్న రోజా తల్లిదండ్రుల వద్దే ఉంటూ జీవనం సాగిస్తోంది. బుధవారం రాత్రి తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి రోజా కనిపించలేదు. కుటుంబీకులు, స్థానికులు రాత్రంతా వెతికారు. చివరకు గురువారం తెల్లవారుజామున ఇంటి సమీపంలోని పెరట్లో ఉన్న పొదల్లో రోజా మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహంపై గొంతు నులిమినట్టుగా ఆనవాళ్లు కనిపించడంతో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తల్లి కమల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఘటన స్థలిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.



విధి నిర్వహణలో క్రీడలు దోహదం చేస్తాయి

- ఎస్పీ కె.సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విధి నిర్వహణలో ఉత్సాహంగా పాల్గొనడానికి పోలీసులకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా పోలీస్ సాయుధ బలగాలకు నిర్వహించిన వాలీబాల్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల మానసిక ఉల్లాసం కోసం వాలీ బాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమన్నారు.గెలుపు ఓటముల కంటే జట్టు సహకారం ముఖ్యమన్నారు. క్రీడలు మనలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలు, పోరాట పటిమను వెలికి తీస్తాయన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో ఐదు టీమ్స్ పాల్గొనగా పాంథర్ టీం విజేతగా నిలిచింది. జాగ్వార్ టీం రెండో స్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ మరియు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, ఆర్ఐ(అడ్మిన్) పెద్దన్న, ఆసిఫాబాద్ సీఐ సతీష్, ఆర్ఐ ఎంటీ అంజన్న, స్పెషల్ పార్టీ ఆర్ఐ షేక్ నాగుల్ మీర, వాంకిడి సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఎస్పీ సురేష్ కుమార్

ఈ-కేవైసీ పేరిట డబ్బులు వసూలు..?



ఈ-కేవైసీ కోసం క్యూ కట్టిన లబ్దిదారులు

నవతెలంగాణ-కెరమెరి

రేషన్ కార్డుకు ఈ-కేవైసీ ప్రక్రియకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత సంవత్సరం సెప్టెంబర్ నుంచి ఈ-కేవైసీ ప్రారంభం అయింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఫిబ్రవరి 29 వరకు గడువు ప్రకటించింది. దీంతో మండల వ్యాప్తంగా కొంతమంది రేషన్ డీలర్లు గ్రామాలలో రేషన్ లబ్ధిదారులతో ఈ-కేవైసీ చేయించారు. ప్రభుత్వ ఆదేశాల కోసం డీలర్లు నిబంధనలమేరకు తమ విధులు నిర్వహించారు. మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఓ రేషన్ డీలర్ మాత్రం ఒక అడుగు ముందుకేసి ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి చేతివాటం ప్రదర్శిచాడు.ఈ-కేవైసీ చేయించుకోవడానికి వచ్చే లబ్ధిదారుల నుండి రేషన్ కార్డుకు రూ.50 రూపాయలు అక్రమంగా వసూలుచేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారులు సదరు డీలర్ తీరుపై మండిపడుతున్నారు. ఈ-కేవైసీకి డబ్బులు ఇవ్వాల అంటూ కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ విషయమై తహసీల్దార్ ప్రసాద్‌ను వివరణ కోరగా ఈ-కేవైసీ కోసం డీలర్ డబ్బుల వసూళ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేపడతామన్నారు.

పదిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కాంప్లెక్స్ మీటింగ్‌కు హాజరై మాట్లాడుతూ గత సంవత్సరాలల్లో వచ్చిన ప్రశ్నపత్రాలను విద్యార్థుల చేత బాగా ప్రాక్టీస్ చేయించాలని, భౌతిక రసాయన శాస్త్రం అంటే భయం లేకుండా విద్యార్థులు సులభంగా ఉత్తీర్ణులయ్యేలా పోలికలు, బేధాలు, ప్రయోగ విధానానికి సంబంధించిన ప్రశ్నలు, పటాలు, సమాచార పట్టిక విశ్లేషణ సంబంధిత ప్రశ్నలను బాగా అభ్యాసం చేయించాలన్నారు. అప్పుడే విద్యార్థులు సైన్స్‌లో సులభంగా ఉత్తీర్ణులవుతారన్నారు. పదవ తరగతి విద్యార్థులకు సంబంధించి రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక 'లక్ష్య' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందజేసిన అభ్యాస దీపికలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి అన్ని సబ్జెక్టులకు సంబంధించి అన్ని అభ్యాస దీపికలలోని అన్ని ప్రశ్నలు చదివేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించి మూడు గ్రూపులకు వేరువేరుగా అభ్యాసం చేయించాలని అప్పుడే పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ బాబు, రిసోర్స్ పర్సన్ రామకృష్ణ, తిర్యాణి, ఆసిఫాబాద్, వాంకిడి, కెరిమెరి మండలాల భౌతిక, రసాయన, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎడ్ల బండ్ల పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తాటిపెల్లి గ్రామంలో గురువారం ఎద్దుల బండ్ల పోటీలను మాజీ ఎంపీటీసీ రోహిణి ఆనంద్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలంలో ఎడ్ల బండ్ల పరుగు పందేలు చాలా నిర్వహిస్తుండేవారని, నేటి సమాజంలో అది కనుమరుగవుతున్నదే దృక్పథంతో తిరిగి ఈ ఆటను పునరావృతం చేయాలని సంకల్పంతో ఎడ్ల బండ్ల పరుగు పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఎద్దుల బండ్ల పరుగు పందేలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నితేష్, రోహిణి సంతోష్, బడిగె సంతోష్, సెంద్రె విజయ్, సంజయ్, పొట్టె దివాకర్, రోహిణి కిశోర్, రౌతు దౌలత్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు అవార్డులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు గుర్తించి, రివార్డులు, అవార్డు అందిస్తామని గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు ఆర్.రమాదేవి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాల ఐదవ వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ విద్యా సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులకు, సబ్జెక్టు ఉపాధ్యాయులు వేరువేరుగా అవార్డులను అందించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రకటించినట్లు తెలిపారు. అదే కాకుండా జిల్లాలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఫలితాల సాధనలో నిర్లక్ష్యం వహించిన ప్రతి ఒక్కరిపై శాఖపరమైన చర్యలు తప్పమన్నారు. క్రీడా పాఠశాలలో క్రీడలపరంగా మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. ఈ ఏడాది వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో 22 మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని వన్నె తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో ఏసీఎంఓ ఉద్ధవ్, డీఎస్ఓ మీనా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నైతం కృష్ణారావు, క్రీడ కోచ్లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, స్థానిక బాలుర పాఠశాల ఉపాధ్యాయులు వైరాగడ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా తాండూరు మండలంలోని నర్సాపూర్ పునరావాస కాలనీలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్ గురువారం భూమిపూజ చేశారు. సింగరేణి నిధులతో ఆలయాన్ని నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. ఆధ్యాత్మిక చింత ఉంటేనే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆలయ నిర్మాణం చేయడం పట్ల సింగరేణి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, మేనేజర్ మహేష్, ఎంపీటీసీ యశోద, జంగుపటేల్, సమ్మయ్య, జమున పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి

● మండల వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ

నవతెలంగాణ-జన్నారం



దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఉమాశ్రీ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బోదకాలు ప్రభావిత గ్రామమైన ఇందన్‌పల్లి గ్రామంలో బుధవారం రాత్రి వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. నివాస ప్రాంతాల్లో అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలోని దాదాపు 300 మందికి రక్త నమూనాలు సేకరించినట్టు తెలిపారు. ఈ రక్త నమూనాలు సేకరించడం వల్ల ఫైలేరియా ప్రాథమిక దశలోనే గుర్తించడం జరుగుతుందన్నరు.

మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

● భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్

నవతెలంగాణ-జైపూర్

ఎండలు ముదురుతున్న నేపథ్యంలో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కల పెరుగుదలను పరిశీలించారు. మొక్కలకు గ్రీన్ నెట్ నీడలు ఏర్పాటు చేయాలని, వరుసల మధ్య పిచ్చి మొక్కలు పెరగకుండా చూడాలని పేర్కొన్నారు.

నిర్ణీత సమయానికి పనుల్లో చేరాలి

పగటి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని రోజు వారి పనుల నిర్వాహణలో నిర్ణీత సమయానికి హాజరు కావాలని జైపూర్ ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. గురువారం పెగడపల్లి గ్రామ శివారులో ఈజీఎస్ ద్వార నిర్మిస్తున్న రోడ్డు పనులను ఏపీఓ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఈజీఎస్ కూలీ పనుల్లో పాల్గొన్న కూలీల హాజరు శాతం పరిశీలించారు. కూలీ రేటు గిట్టుబాటు కోసం నిర్దేశిత కొలతల్లో పనులు నిర్వహించాలని సూచించారు.

వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల పరిషత్ ఉపాధ్యక్షుని ఎన్నిక మరో మారు వాయిదా పడింది. ముగ్గురు సభ్యులకు గాను ఇద్దరు మాత్రమే హాజరు కావడంతో సరిపడా సభ్యులు హాజరు కానందున ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మండల పరిధిలో మొత్తం నాలుగు ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇందులో ఒకరు మండల పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. మిగితా ముగ్గురిలో మద్దికల్ ఎంపీటీసీ జనంపల్లి సమ్మయ్య ఎన్నికల కమీషన్‌కు ఎన్నికల ఖర్చు వివరాలు అందజేయకపోవడంతో ఆయన ఎంపీటీసీ పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. మిగిలిన ఇద్దరు ఎంపీటీసీల్లో ఒకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకోవల్సి ఉండగా ఇద్దరు సభ్యులు ఎన్నికల్లో పాల్గొనకపోవడంతో ఎన్నిక వాయిదా వేస్తూ తీర్మాణించి ఉన్నతాధికారులకు నివేధించినట్లు ఎంపీడీఓ రాధ రాథోడ్ తెలిపారు.

దేవాలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో పవిత్ర గోదావరి నది ఒడ్డున ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయం ఆవరణలో సత్యనారాయణ స్వామి, శివాలయాల పునర్నిర్మాణానికి నిర్వాహకులు భూమి పూజ చేశారు. గతంలో రెండు సార్లు వచ్చిన భారీ వరదకు ఆ దేవాలయం ఆవరణలో ఉన్న శ్రీ సత్యనారాయణ స్వామి, శివాలయాలకు నష్టం వాటిల్లింది ఆలయాలు ఆ వరదలో కొట్టుకుపోయాయి. ఆయా దేవాలయాల పునర్నిర్మాణానికి గురువారం వేద పండితులు, పూజారులు నిర్వాహకులు భూమి పూజ చేశారు. ఆ దేవాలయాలను త్వరగా పూర్తి చేస్తామని వారు తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో కమ్మల భూమయ్య, చిందం శ్రీనివాస్, గ్రామ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, ఎంపీటీసీ దర్శనాల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ కణాక వెంకటస్వామి పాల్గొన్నారు..

ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు



నవతెలంగాణ-జన్నారం

ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని లక్షెట్టిపేట్ సీఐ అల్లం నరేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్నారం మండలంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని వెల్లడించారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా, ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సతీష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఇంటి పన్ను బకాయి వడ్డీపై 90 శాతం రాయితీ

నవతెలంగాణ-మందమర్రి

ఇంటి పన్ను బకాయి వడ్డీపై 90 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ (జిహెచ్ఎంసి-2) డిపార్ట్మెంట్ జీఓ ఆర్‌టీ నెం.101 ఉత్తర్వుల ప్రకారం 31-03-2023లోపు నివాస గృహాలకు సంబంధించిన ఇంటి పన్ను బకాయిలున్న వారికి 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటి పన్ను వన్ టైం సెటిల్మెంట్‌లో కట్టేవారికి 90 శాతం వడ్డీ రాయితీని కల్పిస్తున్నామన్నారు. కుళాయి, ట్రేడ్ లైసెన్స్, ఎంక్రోచ్‌మెంట్ పన్నులు ఇతర బకాయిలు ఉన్నవారు మార్చి31లోపు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. లేని పక్షంలో మున్సిపల్ చట్టం 2019 ప్రకారం ఇంటి కుళాయి తొలగించి స్థిర ఆస్తిని జప్తు చేస్తామని హెచ్చరించారు.

ఓసీ పీఓగా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా తాడేబోయిన శ్రీనివాస్ గురువారం భాద్యతలు స్వీకరించారు. మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో ఉన్న అధికారులు సూపర్‌వైజర్లు సెక్రటేరియల్ సిబ్బంది నూతనంగా వచ్చిన ప్రాజెక్ట్ అధికారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాలరీ మేనేజర్ సుధీర్ జక్కులవార్, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, రక్షణాధికారి శ్రీనివాస్, ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్వర్ రెడ్డి, సంక్షేమ అధికారి శంకర్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన రామగుండం సీపీ



పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న రామగుండం సీపీ

నవతెలంగాణ-వేమనపల్లి

మంచిర్యాల జోన్ నీల్వాయి పోలీస్‌స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాసులు గురువారం మంచిర్యాల డీసీపీ సుదీర్ రాంనాథ్ కేకన్‌తో కలిసి సందర్శించారు. నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం పనులను పరిశీలించి, నిర్మాణం పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, మారుమూల ప్రాంతాల్లో సందర్శించి ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకుని చట్ట పరిధిలో పరిష్కరించాలని, పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా ఉంటూ తమ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ యాంటీ ఎక్స్‌మిస్ట్ ఆపరేషన్‌లో భాగంగా తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ప్రాణహిత పరివాహక ప్రాంతంలో ప్రత్యేక నిఘాలో భాగంగా మావోయిస్టుల కదలికలు,



వారు ఏదైనా సంఘటనలకు పాల్పడే సమాచారం ముందస్తుగా తెలుసుకోవడం కోసం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సరిహద్దు ప్రాంత ప్రజలకు ఒక సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణంలో ఓటును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలు జరిగే విధంగా పోలీస్ అధికారులు సిబ్బంది పనిచేస్తారన్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు హోంగార్డ్ స్థాయి అధికారి నుంచి సీపీ స్థాయి అధికారుల ద్వారా జన జీవన స్రవంతిలో కలిసి కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండవచ్చని, లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున వచ్చే అన్ని సంక్షేమ ఫలాలు అందేలాగా పోలీస్ శాఖ తరుపున అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, చెన్నూర్ ఇన్స్‌పెక్టర్ రవీందర్, నీల్వాయి ఎస్ఐ సుబ్బారావు, కోటపల్లి ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు యువత భవితకు నిరోధకం

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



మత్తు పదార్థాలు, మద్య పానీయాల వినియోగం యువత భవిష్యత్తుకు నిరోధకమని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మత్తు పదార్థాల నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, జిల్లాలో నిషేధించిన మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా వ్యవసాయ, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల సాగుపై మాదర ద్రవ్యాల చట్టం-1985 ప్రకారం చర్యలు తీసకుంటామన్నారు. మత్తు పదార్థాలు అక్రమ రవాణా చేసే వారికి 20 సంవత్సరాల జైలు శిక్షణ, రూ. 2 లక్షల జరిమానా, అవసరం అయితే మరణ శిక్ష కూడా విధించడం జరుగుతుందని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, విక్రయంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా మత్తు పదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జీసీ సుబ్బారాయుడు, ఆబ్కారీ, మద్యపాన నిషేధ శాఖ పర్యవేక్షకులు నందగోపాల్, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ చందన, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్కే ఓసీలో 117 శాతం బొగ్గు ఉత్పత్తి

● మందమర్రి ఏరియా జీఎం మనోహర్



నవతెలంగాణ-మందమర్రి

ఆర్కే ఓసీలో 117 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు మందమర్రి ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జీఎం మనోహర్ మాట్లాడుతూ ఫిబ్రవరి మాసంలో ఏరియాలో సాధించిన ఉత్పత్తి ఉత్పాదకత సంక్షేమ వివరాలను వెల్లడించారు. ఆర్కే ఓసీ 117 శాతం, కేకే-5 104 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందని పేర్కొన్నారు. సమిష్టి కృషితో 100 శాతం పైన ఉత్పత్తి సాధించిన ఉద్యోగులు, కార్మికులు, అధికారులు, సూపర్‌వైజర్లకు అభినందనలు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరు నాటికి అన్ని గనుల్లో 42,03,500 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా 88 శాతంతో 37,08,462 టన్నుల ఉత్పత్తిని సాధించినట్లు చెప్పారు. రామకృష్ణాపూర్‌లో ఓసీపీలో 1,50,000 టన్నులకు గాను 1,76,026 టన్నులతో 117 శాతం, కేకే-5 గనిలో 16000 టన్నులకు 16578 టన్నులతో 104 శాతం ఉత్పత్తి సాధించాయన్నారు. కాసీపేట-1 33 శాతం, కాసీపేట-2 34 శాతం, శాంతిఖని బొగ్గు గని 20 శాతం ఉత్పత్తి సాధించాయని తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఆర్కే-1ఏ గని వద్ద నిర్వహించిన సమ్మక్క సారలక్క జాతరను ఘనంగా నిర్వహించామని దీనికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సింగరేణి సీఎండీ బలరాం ఆదేశానుసారం ఇటీవల ప్రారంభించిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో సోలార్ టెక్నీషియన్, డ్రోన్ టెక్నీషియన్ రెండు వారాల కోర్సులు శుక్రవారంతో ముగియనుందని సంబంధిత సర్టిఫికెట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. బొగ్గు ఉత్పత్తితో పాటు సంక్షేమ కార్యక్రమాలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవై పీఎం ఎండీ ఆసిఫ్ పాల్గొన్నారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని జన్నారం జీపీలో గురువారం రెవెన్యూ అధికారులు, ఓటర్లకు మాక్ పోలింగ్ నిర్వహించారు. వృద్ధులకు వయోజనులకు, ఈవీఎంల ద్వారా ఎలా ఓట్లు వేయాలి, అనే అంశాలపై, వారికి వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు జన్నారం ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ సంతపురి సుధాకర్, కారోబారి బాపన్న పాల్గొన్నారు.

విద్యార్థినులకు షీ టీంపై అవగాహన

నవతెలంగాణ-మందమర్రి

మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌లో కళాశాల విద్యార్థినిలకు గురువారం షీ టీం ఆధ్వర్యంలో మహిళల భద్రత, అస్లీలత, సోషల్ మీడియాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపద సమయంలో వెంటనే డయల్ 100 లేదా షీటీం సభ్యులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. షీ టీం ఇన్‌చార్జి ఎస్ఐ హైమ, ఎస్‌డబ్ల్యూ సంధ్యారాణి, హాస్టల్ ఇన్‌చార్జి నూర్జాహన్, మందమర్రి ఎస్సై రాజశేఖర్, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ అడ్వైజర్ ఎండి సందాని, చీఫ్ లీగల్ అసిస్టెంట్ సబ్బాని సదయ్య, బ్లూ కోర్ట్ సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు పల్లె రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీల్లో రూ.500 గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలు అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే సింగరేణి కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వచ్చే ఇన్సూరెన్స్ రూ.40 లక్షలు ఉంటే ఇప్పుడు రేవంత్ రెడ్డి రూ. కోటి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పోస్టులను భర్తీ చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

పాత పద్ధతిలోనే సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను భర్తీ చేయాలని శ్రీరాంపూర్ ఏరియా అండర్ గ్రౌండ్ జనరల్ మజ్దూర్ కార్మికులు అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా జీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులు గతంలో అండర్ గ్రౌండ్ జనరల్ మజ్దూర్ కార్మికులకు కేటాయించేవారని, కానీ ప్రస్తుతం అన్ని కేటగిరి వారికి వర్తింపజేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కె. సందేష్ కుమార్, సందీప్ రెడ్డి, సందీప్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న 'ప్రేరణ'



నవతెలంగాణ-జన్నారం

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థుల సంసిద్ధతకై అవగాహన, ప్రేరణ కార్యక్రమాలు ఎంతో సత్ఫలితాలను ఇస్తున్నాయని, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని పైడిపల్లి గార్డెన్‌లో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన, మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు పాలన అధికారి బి. రాహుల్, ఆలోచన మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విషయ నిపుణులు అందించే సూచనలు సలహాలు పాటించి ప్రశ్న పత్రాలపై పూర్తి అవగాహన తెచ్చుకుని ఎలాంటి భయభ్రాంతులకు లోను కాకుండా సమర్థవంతంగా పరీక్షలపై పట్టు సాధించాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య కుమారుడైన అరవింద్ పుట్టిన రోజు సందర్భంగా పరీక్షలు రాయబోతున్న అన్ని పాఠశాలల విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులను అందజేసారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీఓ శశికళ, మండల విద్యాధికారి నడిమెట్ల విజయకుమార్, తహసీల్దార్ రాజ్ మనోహర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, ఎంపీఈఓ రమేష్, విషయ నిపుణులు కొండు జనార్ధన్, విజయ్‌కాంత్, డాక్టర్ శివదాస్, ఎన్ చంద్రిక, డీ.రాజన్న, పి.నగేష్, ఎం.రాజన్న, సైకలాజిస్టులు కాసిం, ప్రకాష్ బానావత్, ఆర్ కవిత పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్, ఆర్కే 7, ఆర్కే 6 గనులలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన కార్మికులను గని మేనేజర్లు స్వామి రాజు, శ్రీధర్, తిరుపతి గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో కంపెనీకి చేసిన సేవలను కొనియాడారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని కొత్తగా వస్తున్న ఉద్యోగులు విధులపై దృష్టి సారించాలన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత తదుపరి జీవితాన్ని కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు గనుల అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై పదవి విరమణ కార్మికుడికి ఘనంగా సన్మానం చేశారు. 36 ఏళ్ల జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన నీలం సమ్మయ్యను అధికారులు, యూనియన్ నాయకులు పూలమాలలతో శాలువాలతో సత్కరించి జ్ఞాపకలు అందించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్ కుమార్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్, ఇంజనీర్లు బాబు, మధూకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్. ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, బైరి శంకర్, సొల్లంకి శ్రీనివాస్, రాజేందర్, లింగయ్య, బన్న లక్ష్మణ్ దాస్ పాల్గొన్నారు.

పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-మందమర్రి

రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ హక్కుల కోసం రాజ్యాంగం అనేక చట్టలను అందించిందన్నారు. వాటి గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బీరయ్య, ఎన్‌జీఓ దేవరాజు, పంచాయతీ సెక్రెటరీ శిరీష, ఏఈ రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఎస్సై రాజశేఖర్, మాజీ సర్పంచ్ కొమురయ్య పాల్గొన్నారు.

ఓరియంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మంచిర్యాల శ్రీ హర ఆస్పత్రి సహకారంతో దేవాపూర్, గట్రావ్ పల్లి గ్రామ పంచాయతీల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులతో గ్రామస్తులకు 160 మందికి పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరాలకు ఆయా గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ కంపెనీ హెడ్ ఎంపీ జోషి, హెచ్‌ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి, లైసోనింగ్ ఆఫీసర్ కే.తిరుపతి, డాక్టర్ గౌతమ్, డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ వినోద్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

ఆర్థిక సంవత్సరం 2022-23 ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఓ ఆర్టీ నంబర్ 101 వన్ టైం స్కీం కింద వడ్డీ మాఫీ చేస్తున్నట్లు, మార్చి 31వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ అరిగేలా మల్లికార్జున్ అన్నారు. గురువారం మండలంలోని రౌట సంకపల్లి, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు మంచి భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఎంపీటీసీ మున్నా, మాజీ సర్పంచులు బూసి భీమేష్, పెద్దపల్లి శ్రీనివాస్, బాపూరావు, సీతారాం, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, శంకర్, ఉపాధ్యాయులున్నారు.

ప్రారంభమైన ద్వితీయ సంవత్సరం పరీక్షలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా ప్రారంభమైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు. ఇంటర్ మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు మొత్తం 243 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 242 మంది హాజరయ్యారు. ఒక్కరు గైర్హాజరైనట్టు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా మౌళిక సదుపాయాలు కల్పించినట్టు పేర్కొన్నారు.

రంజాన్ మాసంలో మౌలిక వసతులు కల్పించాలి



నవతెలంగాణ-నిర్మల్

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండల, గ్రామీణ ప్రాంతాలలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా అధ్యక్షుడు, వ్యవస్థాపకులు మహమ్మద్ ఉస్మాన్ మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు కఠోరా ఉపవాస దీక్షలను పాటించడంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. వారు నివసించే వీధులు ఆవాసాలలో పారిశుధ్యం, తాగునీటి, విద్యుత్ దీపాలతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించేలా పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ నిర్మల్ పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొహమ్మద్ బిన్ అలీ, షేక్ ఇంతియాజ్, జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ చాంద్ పాషా, మొహమ్మద్ జుబేర్ హుస్సేన్ ఖాన్ షేక్ షకీల్, మహమ్మద్ ఇంతియాజ్, మహమ్మద్ మసూద్ ఖాన్, మొహమ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షకు 492 మంది గైర్హాజరు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ ను అమలు చేశారు. జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 9347 విద్యార్థులకుగాను 8885 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 492 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ కుమార్ పేర్కొన్నారు. మాస్ కాపియింగ్‌కు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, కేంద్రాల వద్ద అన్ని రకాల వసతులను కల్పించామని పేర్కొన్నారు.

నవగ్రహ, ధ్వజ, శిఖర మందిర ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో నూతనంగా ఏలేటి సుధాకర్‌రెడ్డి దంపతులు నిర్మించిన శ్రీ రాజరాజేశ్వర స్వామి నవగ్రహ, ధ్వజ, శిఖర మందిర ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి గురువారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిని నిర్మించడం ఒక గొప్ప కార్యమన్నారు. వేదమంత్రాలు, పండితుల నడుమ శివాలయ ప్రారంభోత్సవం కన్నుల పండుగ నడిపించిన మండల ప్రజలకు, ఏలేటి సుధాకర్‌రెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. భక్తులు ప్రతి ఒక్కరూ తమ మదిలో ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 3 నెలల ఫౌండేషన్ కోర్సులకు నిరుద్యోగులకు వసతి, భోజన సౌకర్యంతో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి పోటు రవీంధర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బి, ఎస్ఎస్‌సి(స్టాఫ్ సెలక్షన్ కమిషన్) నిర్వహించే ఉద్యోగ ప్రకటనలకు 100 మంది నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 3 లక్షలకు మించి ఉండరాదని, బీఏ, బీఎస్సీ, బీకాం, బీటెక్, బీఎస్సీ(అగ్రి), బీఫార్మసీ ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, మార్చి 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో టీఎస్‌స్టడీసర్కిల్.సీఓ.ఇన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మార్చి 10వ తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, 100 ప్రశ్నలు, 100 మార్కులు అబ్జెక్టివ్ విధానంలో (ఇంగ్లీష్, తెలుగు) ఇవ్వడం జరుగుతుందని, మార్చి 18 నుంచి జూన్ 17వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎస్సీ 70 శాతం, ఎస్టీ 10 శాతం, బీసీలకు 20 శాతం (మైనార్టీతో సహా), మొత్తం మీద 33.3 శాతం మహిళలకు, 5 శాతం దివ్యాంగులకు రిజర్వ్ చేయడం జరిగిందని, ఇంతకు ముందుకు ప్రభుత్వ శిక్షణ పొందిన వారికి అవకాశం లేదని, వివరాలకు 9441333348 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎస్పీ సురేష్ కుమార్
- రాపిడ్ యాక్షన్ ఫోర్స్ భద్రతా బలగాల మార్చ్



ఆసిఫాబాద్‌లో మార్చ్ నిర్వహిస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కేంద్ర భద్రత బలగాల మార్చ్‌ను స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యంగా ఉండేందుకు మార్చ్ నిర్వహించామన్నారు. త్వరలోఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి వర్గ భేదాలు అల్లర్లు లేకుండా ఉండేందుకు జిల్లాలో ఆయా చోట్ల అవగాహన సదస్సులు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ పట్టణంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించిన గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్ నందవార్, ఇన్స్‌పెక్టర్ ప్రధాన్ రమేష్ కుమార్, ఆసిఫాబాద్ టౌన్ సీఐ సతీష్, టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్ఐలు పెద్దన్న, అంజన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

- మార్చ్ 4న జిల్లాకు ప్రధాని రాక
- సభ ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు
- లక్ష మంది జనసమీకరణకు ప్రణాళికలు
- పలు పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మార్చ్ 4న ఆదిలాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారని ఎంపీ సోయం బాపురావు తెలిపారు. ఏరోడ్రమ్‌లో నిర్వహించే బహిరంగ సభకు గ్రామస్థాయి నుంచి జనాలను సమీకరించి, సభను జయప్రదం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఎం సభ విజయవంతంపై ఆదిలాబాద్ పార్లమెంటరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సభ బాధ్యతలను అప్పగించారు. దాదాపు 60 వేల నుంచి లక్ష మంది హాజరయ్యే విధంగా ప్రణాళికలు చేస్తూ బాధ్యతలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరోసారి బీజేపీ అధికారం చేపట్టేలా ప్రచారంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదిలాబాద్‌కు వస్తున్నారన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. సభకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున జనాలు వచ్చేలా కార్యకర్తలు సమన్వయంతో సాగాలన్నారు. జనసమీకరణయే లక్ష్యంగా గ్రామాల్లో కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఇదిలా ఉంటే అటూ ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ల్యాండ్ ప్రాంతమైన ఏరోడ్రమ్‌ను ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి పరిశీలించారు. ల్యాండింగ్ తరువాత అక్కడి నుంచి సభ స్థలానికి వచ్చే మార్గాన్న పరిశీలించి, పలు సూచనలు చేశారు.



సభ ఏర్పాట్ల గురించి డీఎస్పీతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

పలు అభివృద్ధి పనులకు మోడీ శంకుస్థాపన..

దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్‌కు రావడం ఆదిలాబాద్ ప్రజలకు ఒక పండగ లాంటిదని అన్నారు. మార్చి 4న నరేంద్రమోడీ ఆదిలాబాద్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. ఆదిలాబాద్ నుంచి బేల మీదుగా మహారాష్ట్ర వైపు వెళుతున్న జాతీయ మార్గానికి రూ.450కోట్లతో పనులకు శంకుస్థాపన, రూ.220 కోట్లతో పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా ప్రతి కార్యకర్త, ప్రతి అభిమాని తమ వంతు కృషిని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, పార్లమెంట్ ప్రభారి అల్లపూరే శ్రీనివాస్, కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, ఆధినాథ్, అభినవ్ సర్దార్, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. పట్టించుకోని అధికారులు

- తరుచూ ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

నవతెలంగాణ-నార్నూర్

సంబంధిత అధికారుల ఉదాసీనత వైఖరి, ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. అనునిత్యం రాకపోకలు సాగించేవారిలో కొందరికి ప్రమాదాలు తప్పడం లేదు. తరచూ వాహనాలు మరమ్మతులకు ఖర్చు చేయాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గంగాపూర్, మాన్యాపూర్ గ్రామాల మధ్య ప్రధాన రోడ్డుపై చాలా రోజుల నుంచి గుంతలు ఏర్పడటంతో ప్రమాదంగా మారిందని, పలువురు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నార్నూర్, గాదిగూడ మండల కేంద్రాలు ఉండటంతో నిత్యం వాహనాల రద్దీతో ద్విచక్ర వాహనాలు ఆటోలు నడుస్తూ బీజీగా ఉంటుంది. రాత్రి వేళలో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత శాఖాధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని, కనీసం మరమ్మతులు చేయకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

నిమిషం నిబంధన ఎత్తివేయాలని డీఐఈఓకు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ విద్యార్థులకు నిమిషం నిబంధన ఎత్తివేయాలని, విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం జిల్లా ఇంటర్ బోర్డు అధికారి రవీందర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమిషం నిబంధనతో జైనథ్ మండలవాసి ఆత్మహత్య చేసుకోవడం బాధకరమన్నారు. పరీక్ష కేంద్రమైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో తన మొదటి పరీక్షను రాయాల్సి ఉండగా నిమిషం ఆలస్యం అయిన కారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాల సిబ్బంది లోనికి రానివ్వని కారణంగా విద్యార్థి తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించవద్దని ఏదైతే నిబంధన ఉందో దాన్ని వెంటనే ఎత్తివేయాలని అలాగే విద్యార్థి కుటుంబానికి తగు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ బి.రాహుల్, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడం సాయికుమార్, ఏఐఎఫ్డీఎస్ జిల్లా కార్యదర్శి కుంటాల నవీన్ కుమార్, ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్సకోల అశోక్, టీఎస్ఎఫ్ జిల్లా నాయకులు సత్యనారాయణ, ఎస్వీఏ జిల్లా అధ్యక్షులు గోష్లే సుజయ్ ఇష్టేకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



డీఐఈఓకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మత్తు పదార్థాలు-వాటి ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో దేశంలోని ప్రజలు మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండి, వాటికి బానిసలుగా మారకుండా చర్యలు చేపడుతుందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 47లో మత్తు పదార్థాల వినియోగం, ప్రజల శ్రేయస్సు పట్ల స్పష్టంగా వివరించిందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే క్రమంలో మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం చిత్తు అవుతుందని వివరించారు. నేటి సమాజంలో గంజాయి, డ్రగ్స్ వినియోగం ఎక్కువగా ఉందని ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యాపారం చేయడం సహించలేనిదన్నారు. విద్యార్థుల ఆరోగ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమని గుర్తించాలన్నారు. అంతే కాకుండా విద్యార్థులు తమ పరిసరాలను గమనిస్తూ చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు విద్యార్థుల చదువు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ముఖ్యంగా తమ కాలేజ్ పరిసరాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే పోలీస్ శాఖకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సవిత, కెమిస్ట్రీ, జంతుశాస్త్ర విభాగ అధిపతులు కుమార స్వామి, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పనిచేసిన పైసలు ఇవ్వండి సారు

- బోరింగ్ మెకానిక్ బూదయ్య



నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో చెడిపోయిన బోర్లకు మరమ్మత్తు పనులు చేసినప్పటికీ పలు పంచాయతీల అధికారులు రెండు సంవత్సరాలుగా వేతనం చెల్లించడం లేదని, ప్రత్యేక అధికారులు స్పందించి వేతనం చెల్లించాలని బోరింగ్ మెకానిక్ బూదయ్య అధికారులను వేడుకుంటున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీలలో బోర్లకు మరమ్మత్తులు చేసినప్పటికీ 13 పంచాయతీల అధికారులు డబ్బులు చెల్లించారని, మిగిలిన బెజ్జూరు, బారెగూడ, మర్థిడి, కుకుడా, పెద్ద సిద్ధాపూర్, సుస్మీర్, కుంటలమానెపెల్లి, లంబాడిగూడా పంచాయతీలకు సంబంధించిన డబ్బులు చెల్లించడంలేదన్నారు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని పాలకవర్గం రద్దై ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నందున అధికారులు స్పందించి వేతనం చెల్లించాలని కోరారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీరు అందించాలని ప్రభుత్వం ఆదేశాల జారీ చేయడంతో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేస్తున్నారని, అందుకు తగిన పారితోషికం ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని మెకానిక్ బూదయ్య కోరుతున్నారు.

మార్కండేయ విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని లాండసాంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయంలో గురువారం మార్కండేయ విగ్రహాన్ని ప్రతిష్టాపించారు. ఈ వేడుకల్లో పూజారులు శ్రీకాంత్ శర్మ, అరుణ్ శర్మలు పాల్గొని, విగ్రహ ప్రతిష్టాపన, హోమం, పూజాధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కామణి విఠల్, తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొమ్మకంటి రమేష్‌లు మాట్లాడుతూ పద్మశాలి కులస్తుల కులదైవం మార్కండేయ విగ్రహ ప్రతిష్టాపనకు సహకరించిన కులస్తులకు, గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోర హనుమన్లు, వెంకటస్వామి, ఆలయ కమిటీ చైర్మెన్ జిట్ట రమేష్, కోశాధికారి మోర దత్తు, ఉపాధ్యక్షుడు జిట్ట నర్సింగ్, సభ్యులు బొమ్మకంటి నర్సింగ్, అశోక్, సత్యనారాయణ, గంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిమిషం నిబంధన విద్యార్థుల చావులతో చెలగాటం ఆడుతోందని, నిమిషం నిబంధన ఎత్తివేయాలని విద్యార్థి యువజన సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షులు మెస్రం భాస్కర్ అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు మనోభావానకు గురై ఆత్మహత్యాలు చేసుకుంటున్నారని అన్నారు. జైనథ్ మండలం మాంగుర్ల గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థి టేకం శివకుమార్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యగా భావిస్తున్నామని అన్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వమే బాధ్యత వహించి, వారి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, 10 ఎకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిమిషం ఆలస్యం నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సురేష్, కృష్ణ, మురళి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలు ఢీ కొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ మండలకేంద్రానికి చెందిన భీమయ్య(53) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీ కొని మృతిచెందినట్టు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మృతుడు భీమయ్య తన తమ్ముడి కుమారుడి నిశ్చితార్థానికి ఉదయం కాశిపెల్లి గ్రామానికి వెళ్లి తిరిగి రాత్రి ఎనిమిది గంటలకు ఇంటికి వచ్చాడు. తన బర్రె ఇంటిలో లేకపోవడంతో ఉదయం వరకు వస్తుందని అనుకొని పడుకున్నాడు. ఉదయం నాలుగు గంటలకు నిద్రలేచే సరికి ఇంటికి బర్రె రాకపోయేసరికి బర్రెను వెతుక్కుంటూ తన గొల్లవాడ సమీపంలో గల చీలపెల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గల రైలు పట్టాలు దాటుతుండగా బల్లార్షా నుండి మంచిర్యాల వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీ కొని మరణించినట్టు తెలుస్తోంది. మృతదేహాన్ని మృతుడి భార్య లక్ష్మికి అప్పగించి విచారణ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సేల్స్ మెన్ మృతికి ప్రగాఢ సంతాపం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో పనిచేస్తున్న సేల్స్‌మెన్ ఇస్తారి మృతిచెందడంతో ఆయన మృతికి మండలంలోని డీలర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఇస్తారి అందరితో కలిసిమెలిసి ఉండేవాడని, ఆయన మరణం తీరనిలోటని, ఆయన మన మధ్య లేకపోవడంతో ఎంతో చింతిస్తున్నామని సంఘం నాయకులు తెలిపారు.